క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఏఎస్ఐ

పాలసముద్రం: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్ఐ రమణరావ్ హెచ్చరించారు. శుక్రవారం బలిజకండ్రిగ షోలింగర్–పల్లిపట్టు జాతీయ రహదారిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మోటార్ సైక్లిస్టులు మద్యం సేవించి బైక్ నడుపుతున్నారా, లేదా? అని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. అలాగే వాహనాల రికార్డులు పరిశీలించారు.

నట్టల నివారణ మందుల పంపిణీ


మందులు తాపిస్తున్న దివ్య

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని మారేపల్లె, పెరుమాళ్లపల్లె గ్రామాల్లో పశుసంవర్ధక సహాయకురాలు దివ్య ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, దూడలకు నట్టల నివారణ మందులు తాపించారు. పశువుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడిరైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

వంద శాతం ఉపాధి పనులు

నింద్ర: మండలంలోని ఉపాధి కూలీలకు వంద శాతం పనులు కల్పించాలని నగరి డివిజన్ ఉపాధి హామీ ఏపీడీ శోభన్ బాబు సూచించారు. మంగలివాని గుంటలో జరుగుతున్న పనులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత వుండాలని చెప్పారు. అనంతరం రోజ్‌గార్ దివస్ పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఇందుమతి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే ప్రారంభం


రైతు భూమిలో చేస్తున్న రీ సర్వేలో హద్దులు గుర్తిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం: జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకంలో చేస్తున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాబు కోరారు. శుక్రవారం పాలసముద్రం రెవెన్యూ దాఖలాలో భూ రీ సర్వే కార్యక్రమం ప్రారంభించారు. రైతులతో తహసీల్దార్ మాట్లాడారు. దేశంలో ఎక్కడా చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అధికారులే భూముల కొలతలు వేసి, సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసి, రైతులకు హక్కు పత్రాలను అందజేస్తున్నార న్నారు. దీనిని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సాధు, విలేజ్ సర్వేయర్ బాషా, వలంటీర్ శక్తివేలు, గ్రామ సేవకుడు, రైతులు పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ


చోరీకి గురైన ఆలయం

నగరి: మండలంలోని మాంగాడు గ్రామంలో ఉన్న అలమేలు మంగమ్మ, బావనారాయణ, యాగాతమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. అలమేలు మంగమ్మ ఆలయంలో అమ్మవారి తాళిబొట్టు, హుండీ అపహరించారు. బావనారాయణ ఆలయంలో అమ్మవారి తాళిబొట్టు చోరీ చేశారు. యాగాతమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాలను పరిశీలించారు.

పుత్తూరు ఎంపీడీవో కార్యాలయం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

పుత్తూరు రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 వరకు రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఇందిరను అడిగి ఆరా తీశారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోనూ సమావేశమై పలు విషయాలపై చర్చించారు. విభాగాల వారీగా చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. అంకిత భావంతో పనిచేయాలని, పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు.

శివపూజకు వేళాయె!

- నేడు మహాశివరాత్రి వేడుకలు
- ముస్తాబవుతున్న ఆలయాలు


విద్యుత్ దీప కాంతుల్లో పుత్తూరు శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం


పుత్తూరు సదాశివేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ఆదిదంపతులు


ఆలయం లోపల పుష్పాలంకరణ


కార్వేటినగరం: విద్యుద్దీపాలతో వెలుగుతున్న ఆలయం

నగరి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలోని శైవక్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. గుండ్రాజుకుప్పం పంచాక్షర గిరులపై వెలసిన హనుమతేశ్వరక్షేత్రంలో శివరాత్రి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సరస్వతి, శివపార్వతులు, అభయాంజనేయ స్వామి ఆలయాలను ఇప్పటికే రంగులు వేసి ముస్తాబు చేశారు. భారీ ఎత్తున అన్నదానం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కీళపట్టు త్రిపుర సందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో ధ్యాన శివుని, గజసంహార మూర్తి విగ్రహాన్ని దర్శనానికి ఉంచారు. బుగ్గఅగ్రహారం గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర ఆలయాన్ని ముస్తాబుచేశారు. రాత్రి హరికథ కాలక్షేపం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. నగరి కామాక్షి సమేత కరకంతేశ్వర స్వామి ఆలయానికి మంత్రి ఆర్కే రోజా నంది వాహనం బహుకరించడంతో ఆలయంలో నాలుగు కాల పూజలు, లింగోద్భవ పూజతో పాటు నందివాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ముడిపల్లి నామతీర్థం కొండపై ఉన్న నాగలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తుల తాకిడికి తగినట్లుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వేలంజేరి మంగళీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం నుంచే మొదలయ్యాయి. ఆలయంలో ప్రత్యేక యాగపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని అరటి చెట్లతోను, పుష్పాలతోను అలంకరించారు.

మహాశివరాత్రి ఘనంగా ఏర్పాట్లు

వడమాలపేట: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు శనివారం భక్తుల తాకిడి పెరుగుతున్నందున తగినట్లు క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. సదాశివకోనకు భక్తులు శుక్రవారం ఉదయమే బయల్దేరారు. ఆలయం వద్ద క్యూలు, విద్యుత్ దీపాలు, నీటి వసతి కల్పించారు. ఓ.బీ.ఆర్ కండ్రిగ పంచాయతీ పరిధిలోని వెద్దళ్ల చెరువు గట్టుపై ఉన్న శివాలయంలో, అప్పలాయగుంట, వడమాల, వడమాలపేట, శివాలయాలను వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలంకారణతో సుందరంగా అలంకరించారు.

ముస్తాబైన సదాశివేశ్వర ఆలయం

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల తాకిడిని నియంత్రించేందుకు ఆలయంలో ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేశారు. ఆలయం లోపల వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్ రమేష్‌బాబు మాట్లాడుతూ శనివారం వేకువ జామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనభాగ్యం కల్పిస్తామని, తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణి, సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శివాలయాలు ముస్తాబు

కార్వేటినగరం: మండలంలోని సుద్దగుంట సమీపంలోని శిష్టసౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణ చుట్టూ చలువ పందిళ్లు వేసి, భక్తుల సౌకర్యార్థం తాగు నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ గోపురాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే కార్వేటినగరం ప్రసిద్ధి స్కంధ పుష్కరిణి వద్ద ఉన్న తంగమేశ్వరస్వామి ఆలయాన్ని కూడా విద్యుత్ దీపాలతో శోభాయానంగా తీర్చిదిద్దారు.

నేటి పూజా కార్యక్రమాలు

ఉదయ 5 గంటలకు అభిషేక పూజలు, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల ఊరేగింపు, 6గంటలకు మహా జ్యోతి లింగార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, అభిషేకం ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల వితరణతో అన్నదానం చేస్తారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. అగరమంగళంలోని శ్రీగుర్రప్పస్వామి అంకాళపరమేశ్వరి ఆలయం, గంగాధరనెల్లూరు సమీపం శ్రీగంగాధరేశ్వరస్వామి ఆలయం, కొట్రకోనలోని శ్రీమల్లేశ్వరస్వామి ఆలయం, మహదేవమంగళంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, ఎస్ఎస్‌కొండ గ్రామంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయం, వెజ్జుపల్లి, వేల్కూరులోని శివాలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పచ్చని పందిళ్లు వేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. వేకువజామున అభిషేకాది పూజలు, అన్నదానం, రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు శని త్రయోదశి వేడుకలు

గంగాధరనెల్లూరు: శని త్రయోదశి సందర్భంగా శనివారం మహదేవమంగళం సమీపంలో వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలోని శనేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తామని ఆలయ పూజారి రుషికేష్ తెలిపారు. ఉదయం స్వామివారికి తైలాభిషేకం, హోమాది పూజలు చేయనున్నట్లు చెప్పారు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

వెదురుకుప్పం: మహా శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలోని శ్రీ కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని, స్వామి అమ్మవార్ల కటౌట్లను విద్యుదీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలాగే కమ్మకండ్రిగ సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయం, చవటగుంటలోని నందీశ్వరస్వామి ఆలయం ,తిరుమలయ్యపల్లెలోని ఆవుదేవర నందీశ్వర స్వామి, ముతాలం సమీపంలోని సిద్దేశ్వర స్వామి ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.






ఓబీఆర్ కండ్రిగ: కొలువైనశివపార్వతులు, ధ్యానముద్రలో తీర్చిదిద్దిన పరమేశ్వరుడి ప్రతిరూపం, నగరి: ముస్తాబవుతున్న హనుమతేశ్వర ఆలయం, మంగళేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న హోమ పూజలు, ముస్తాబవుతున్న మంగళేశ్వర ఆలయం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన వసతులు

నగరి: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మెరుగైన వసతులు ఉన్నాయని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన తరువాత విద్యార్థులు చేరవచ్చని ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం 'కళాశాల భౌతిక సౌకర్యాలు, మానవ వనరులతో పరిచయం' పేరుతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాలమైన తరగతి గదులు, డిజిటల్, వర్చువల్ గదులు, విశాలమైన ఆటస్థలం , సామాజిక అవగాహనా కార్యక్రమాలు, ఉద్యోగ మేళా అన్నింటికీ మించి అత్యున్నత విద్యార్హత, నైపుణ్యం కలిగిన సిబ్బంది ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వినియోగించుకోవాలని కోరారు.


అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అధ్యాపకునికి అంతర్జాతీయ అవార్డు

విద్యా బోధనలో అత్యున్నత ప్రమాణాలను పాటించినందుకు, స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అధ్యాపకులు, పీజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్‌కు అంతర్జాతీయ అకడమిక్ అచీవర్ అవార్డు దక్కింది. ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మధ్యప్రదేశ్‌లోని ఏకేఎస్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా థాయిలాండ్‌లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ అకడమిక్ అచీవర్స్–2023 న్యూ ఢిల్లీ' కార్యక్రమంలో ఈ అవార్డును ప్రకటించారు. అయితే ఆయన హాజరుకాకపోవడంతో, గురువారం ఆయనకు ఈ అవార్డు పోస్టు ద్వారా అందింది. దీంతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్‌తోపాటు అధ్యాపకులు ఆయన్ను సత్కరించారు.

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

కార్వేటినగరం: ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాల విద్యార్థులకు ఓపెన్ డే ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యా వసతులపై పరిశీలన కోసం వచ్చారు. ప్రిన్సిపల్, అధ్యాపక బృందం కళాశాలలోని అన్ని విభాగాల గురించి వారికి క్షుణ్ణంగా వివరించారు. ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్, స్మార్ట్ బోర్డు టీచింగ్, జేకేసీ ఇంగ్లిష్ ల్యాబ్, అధునాతన డిజిటల్ లైబ్రరీ, కళాశాల క్రీడామైదానం మొదలైన వాటిని వారికి చూపించి అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

ఆపస్ మండల నూతన కార్యవర్గం ఎంపిక



శేఖర్, చెన్నకేశవులు

కార్వేటినగరం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కార్వేటినగరం మండల అధ్యక్ష కార్యదర్శులుగా జే.శేఖర్(కత్తెరపల్లె ఉన్నత పాఠశాల), చెన్నకేశవులు(ఎంపీపీఎస్ గంగమాంబపురం)ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ. దొరస్వామిరాజు తెలిపారు. శుక్రవారం గంగమాంబపురం ప్రాథమిక పాఠశాలలో ఆపస్ మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు కరణం గిరిబాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఢిల్లీబాబు, కార్యదర్శులుగా ఎస్.శ్రీరాములు, కోశాధికారిగా గుణశేఖర్, మహిళా కార్యదర్శులుగా సుప్రసన్న, పుష్పలతను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా కన్వీనర్ చెన్నకేశవరెడ్డి, జీడీనెల్లూరు నియోజకవర్గ ఆపస్ కన్వీనర్ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన


నగరిలో అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

పుత్తూరు రూరల్: భారతీయ స్టేట్ బ్యాంకు సేవలపై గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తిరుపతి రీజనల్ మేనేజర్ డి.సత్యనారాయణ తెలిపారు. పుత్తూరులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్బీఐ ద్వారా డ్వాక్రా సంఘాలకు, పశువుల పోషణకు, కుటీర పరిశ్రమలకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు.

ఎస్సీ కాలనీలో అవగాహన

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడ ఎస్సీకాలనీలో బ్యాంకు వ్యవహారాలపై స్టేట్ బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. స్టేట్ బ్యాంకు మేనేజర్ రియాజ్ బాబు, రీజినల్ అధికారి సుబ్బారావు స్థానికులకు జీరో అకౌంట్ ప్రారంభించే విధానంపై అవగాహన కల్పించారు. బ్యాంకులో రుణాలు పొందడానికి అర్హతలు, నిబంధనలు, చెల్లింపులపై వివరించారు.

ఘనంగా అగస్త్యేశ్వరునికి అన్నాభిషేకం

చంద్రగిరి: మండలంలోని స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం మండప ఆరాధన, కలశ స్థాపన, అఖిలాండం, గణపతి హోమం, పూర్ణాహుతి, రుద్రాభిషేం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు మూలవిరాట్‌కు అర్చకులు శాస్త్రోక్తకంగా అన్నాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి అన్నదానం చేశారు. రాత్రి స్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఉదయం 1.30 గంటలకు అగస్త్య మహామునికి అభిషేకంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు రాత్రి నంది వాహనంతో ముగుస్తాయి. అలాగే శేషాపురం ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

పుత్తూరు రూరల్: వ్యాయామం క్రమం తప్పకుండా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. స్థానిక కావమ్మ గుడి ఆవరణలో శుక్రవారం రాష్ట్రీయ సేవా సమితి (రాస్), టాటా ట్రస్ట్ హాస్పిటల్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నా ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హరి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పారని, ఆదిశగా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం బి.పి. షుగర్, హైపటైటీస్, నోరు, రొమ్ము, గర్భసంచి సంబంధిత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, అన్బులగన్, కమల, బాబు, జయలక్ష్మీ, టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న టాటా ట్రస్ట్ వైద్యులు

సూర్య, చంద్రప్రభలపై శ్రీనివాసుడి వైభవం


ఊరేగుతున్న గోవిందుడు, చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు, వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శన

- వైకుంఠాన్ని తలపిస్తున్న శ్రీనివాసమంగాపురం
- అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శుక్రవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వామి మహావిష్ణువు అలంకరణలో సూర్యప్రభ వాహనంపై కొలువుదీరి దివ్య కిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకుముందు ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. ఉత్సవ మూర్తిని అలంకార మండపంలోకి వేంచేపు చేశారు. అక్కడ స్వామిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు శ్రీనివాసుడు చంద్రప్రభ వాహనంపై కొలువై తన చల్లని అమృత కిరణాలతో భక్తులను కటాక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారికి ధూప, దీపాలతో మంగళ హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం ఆలయ డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గురుమూర్తి, ఏవీఎస్ఓ విశ్వనాథం, వీఐ సురేష్ రెడ్డి, సూపరింటెండెంట్లు చెంగ్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వాహన సేవ ముందు కేరళ వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తున్న చిన్నారులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన శనివారం ఉదయం స్వామి వారి రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవ ఉంటాయి.

కల్పవృక్షంపై సోమస్కందమూర్తి చిద్విలాసం

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం ఉదయం స్వామి కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. మంగళవాయిద్యాల నడుమ, భజన మండళ్ల కోలాటాల మధ్య స్వామి వారి వాహన సేవ వేడుకగా సాగింది. అనంతరం ఆలయంలో కంకణభట్టార్ ఉదయస్వామి ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. రాత్రి స్వామి అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు

నేడు మహాశివరాత్రి వేడుకలు

కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 2.30 నుంచి 4.30 గంటల వరకు మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 8 నుంచి 10 గంటల వరకు రథోత్సవం, 10.30 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు నంది వాహన సేవ నిర్వహించనున్నారు. సాయంత్రం 5.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం కల్పిస్తారు. 19వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు లింగోద్భ కాల అభిషేకం నిర్వహిస్తారు.